## క్లుప్తంగా

### ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు



జగ్గయ్యపేట అర్బన్: క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని ప్రభుత్వ విప్, జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఏసుక్రీస్తు మార్గం అందరికీ ఆచరణీయని పేర్కొన్నారు. ఈ పండుగ అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు.

### ప్రతిఒక్కరి జీవితంలో వెలుగులు నిండాలి



నందిగామ టౌన్: క్రిస్మస్ పర్వదినం ప్రతిఒక్కరి జీవితంలో నూతన వెలుగులు నింపాలని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహనరావు ఆకాంక్షించారు. నియోజకవర్గ ప్రజలు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు మాట్లాడుతూ క్రిస్మస్ పండుగను ప్రతిఒక్కరు సంతోషంగా జరుపుకోవాలన్నారు. ముఖ్యంగా అర్ధరాత్రి సమయాల్లో జాతీయ రహదారులను దాటుకుని చర్చిలకు వెళ్లేవారు జాగ్రత్తలు పాటించాలని కోరారు.

### అయ్యప్పలకు 50రోజులుగా అన్నదానం





అక్కయ్యగౌడ్

నవాబుపేట(పెనుగంచిప్రోలు): అయ్యప్పస్వామికి ఎంతో ఇష్టమైన అన్నదానాన్ని(చద్ది) ప్రారంభించి అందరి అభినందనలు పొందుతున్నాడు గ్రామానికి చెందిన కోసూరు అక్కయ్య గౌడ్. తన 18వ పడి సందర్భంగా గ్రామంలోని పురాతన శివాలయంలో దీక్షాస్వాములకు ఈఏడాది నవంబర్ 9వ తేదీ నుంచి నిత్యం అన్నదానం చేస్తున్నారు. రోజూ సుమారు 50 నుంచి 60మంది అయ్యప్ప దీక్షాపరులకు చద్ది ఏర్పాటు చేస్తుండటంపై గ్రామస్తులతోపాటు అయ్యప్పదీక్షాపరులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. ఇతర గ్రామాల నుంచి వచ్చే స్వాములతోపాటు ఇంట్లో వీలు కుదరక పోయినా, మరే ఇతర కారణాలతోనైనా దీక్షాపరులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు అక్కయ్యగౌడ్ తెలిపారు. డిసెంబర్ 31వతేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. చద్ది ఏర్పాటు కార్యక్రమం తనకు ఎంతో సంతృప్తిని ఇస్తోందని, నిర్వహణలో దాతల సహకారంతో కూడా మరువలేనిదని ఆయన వివరించారు.

### వ్యక్తికి తీవ్రగాయాలు

కంచికచర్ల : బైక్‌పై వెళ్తున్న ఓ యువకుడు మద్యం మత్తులో రోడ్డుపై ఏర్పాటు చేసిన ప్రమాద సూచికల డ్రమ్ములను ఢీకొని తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం కంచికచర్లలో చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం కొండపల్లి బీ కాలనీకి చెందిన బెజవాడ ఉదయ్ నందిగామలో ఉంటున్న తనభార్య వద్దకు వెళ్లి, తిరిగి ఇంటికి వెళ్లే క్రమంలో మద్యంమత్తులో పేరకలపాడు క్రాస్‌రోడ్డు సమీపంలోకి రాగానే రోడ్డుపై ఉన్న డ్రమ్ములను ఢీకొట్టాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఉదయ్‌ని 108 సిబ్బంది చికిత్స నిమిత్తం నందిగామ వైద్యశాలకు తరలించారు. అనంతరం కుటుంబసభ్యులు మెరుగైన వైద్యం కోసం అతన్ని విజయవాడలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.






# క్రిస్మస్ వేడుకలకు చర్చిలు ముస్తాబు



విద్యుత్ దీపాలంకరణలో జగ్గయ్యపేటలోని సీఎస్ఐ టౌన్‌చర్చి



నందిగామలో ఏర్పాటు చేసిన పశువుల పాక సెట్టింగ్



నందిగామ చర్చిలో ప్రత్యేక ఆకర్షణగా ఉన్న బాలఏసు ప్రతిమ



కీసరలోని సెవెంత్ డే చర్చి వద్ద ఏర్పాటు చేసిన క్రిస్మస్ స్టార్

జగ్గయ్యపేట అర్బన్: క్రిస్మస్ వేడుకలకు జగ్గయ్యపేట నియోజకవర్గంలోని చర్చిలు ముస్తాబయ్యాయి. క్రైస్తవులు రంగు రంగుల విద్యుద్దీపాలంకరణలతో చర్చిలను సుందరంగా తీర్చిదిద్దారు. క్రిస్మస్ ఆరాధన ప్రార్థనలకు చర్చిలలో తగు ఏర్పాట్లు చేశారు. జగ్గయ్యపేట పట్టణంలోని పోస్టాఫీసు వద్ద ఉన్న సెయింట్ థామస్ సీఎస్ఐ టౌన్ చర్చి, హైస్కూల్ రోడ్డులోని యేసు తిరుహృదయ ఆర్‌సీఎం చర్చి, కోదాడ రోడ్డులోని బేతస్థ చర్చి, బలుసుపాడురోడ్డులోని బేతేలు చర్చి, విలియంపేట, క్రిస్టియన్‌పేటలోని చర్చిలు, తొర్రగుంటపాలెంలోని సియోను చర్చి, ఆర్టీసీ కాలనీలోని హోసన్నా ప్రార్థనా మందిరం, కాకానినగర్‌లోని ద కాలేజ్ ఆఫ్ బైబిల్ టెక్నాలజీ క్రైస్ట్ చర్చి, షాలేం చర్చిలను ఆయా పాస్టర్లు, సంఘాల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అలంకరించారు. క్రిస్మస్ స్టార్లు, క్రీస్తు జనన వృత్తాంతాన్ని తెలియజేసే పశువుల పాక సెట్టింగ్‌లతో చర్చి ప్రాంగణాలను అందంగా ముస్తాబు చేశారు.



పేట ఆర్‌సీఎం చర్చి ఆవరణను రంగవల్లులతో తీర్చిదిద్దుతున్న సంఘస్తులు

**కాంతులీనుతున్న చర్చిలు..**

నందిగామ: క్రిస్మస్ వేడుకలకు నందిగామ పట్టణంతోపాటు నియోజకవర్గంలోని చర్చిలన్నీ ముస్తాబయ్యాయి. విద్యుత్ దీపాల వెలుగుల్లో చర్చిలు దేదీప్యమానంగా వెలుగొందుతున్నాయి. ముక్కపాటినగర్ స్నేహపురిలోని వేళంగిణి మాత చర్చి, ఆర్‌సీఎం చర్చితోపాటు అన్ని క్రైస్తవ మందిరాల్లో ఆదివారం రాత్రి పదిగంటల నుంచి క్రిస్మస్ ఆరాధనలు ప్రారంభమయ్యాయి.

**వీరులపాడు మండలంలో..**

వీరులపాడు: క్రిస్మస్ వేడుకలకు వీరులపాడు మండలంలోని చర్చిలన్నీ ముస్తాబయ్యాయి. విద్యుద్దీపాలతో చర్చిలను అలంకరించారు. ఆరాధన ప్రార్థనలకు ఏర్పాట్లు చేశారు.



వీరులపాడులోని చర్చి ఆవరణలో ఏర్పాటు చేసిన పశువుల పాక సెట్టింగ్



పేట ఆర్‌సీఎం చర్చిలో దివ్యబలి పూజ కార్యక్రమానికి ముస్తాబైన వేదిక



ప్రత్యేకాలంకరణలో పేట ఆర్‌సీఎం చర్చి హాలు



కీసరలో విద్యుత్ కాంతులతో విరాజిల్లుతున్న ఆర్‌సీఎం చర్చి



విద్యుత్ దీపాలంకరణలో నందిగామ ఆర్‌సీఎం చర్చి

## క్రీడాకారులను ప్రోత్సహించేందుకే ఆడుదాం ఆంధ్రా



ఆడుదాం ఆంధ్రా ర్యాలీని ఉద్దేశించి మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను

**విప్ ఉదయభాను**

చిల్లకల్లు(జగ్గయ్యపేట): గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని చేపట్టారని ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను పేర్కొన్నారు. ఈనెల 26నుంచి ప్రారంభం కానున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా ఆదివారం చిల్లకల్లులో మారథాన్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 47రోజుల పాటు ఈ క్రీడాసంబరం కొనసాగనుందని వివరించారు. చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా మెగా క్రీడాటోర్నీకి సీఎం జగనన్న ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ డబుల్స్ పోటీలు జరుగుతాయని వివరించారు. ఈపోటీల్లో పాల్గొనేందుకు నియోజకవర్గంలో వేలాది మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. ఈ పోటీల నిర్వహణకు అవసరమైన క్రీడాసామగ్రిని ఇప్పటికే ఆయా సచివాలయాలకు పంపిణీ చేసినట్లు చెప్పారు. క్రీడా పోటీల వివరాలు, ఆయా పోటీలను నిర్వహించే మైదానాల వివరాలతో కూడిన కరపత్రాలను క్రీడాకారులకు అందజేసినట్లు వివరించారు. క్రీడాకారులంతా ఈ పోటీల్లో పాల్గొనాలన్నారు. క్రీడలను తిలకించేందుకు సైతం వేలాది మంది ప్రేక్షకులు రిజిస్ట్రేషన్ చేసుకోవడం గొప్పవిషయమని ఉదయభాను పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి జయచంద్ర, ఎంపీడీవో రమేష్‌బాబు, కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మండల పార్టీ కన్వీనర్ శ్రీనివాసగౌడ్, మాజీ సర్పంచ్ సంపత విజిత, గ్రామపార్టీ నాయకులు శ్రీనివాసరావు, రాజు, వెంకటేశ్వర్లు, పుల్లయ్య, బుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సెమీక్రిస్మస్ వేడుకలు



కేక్ కట్ చేస్తున్న మున్సిపల్ మాజీ చైర్మన్ ఇంటూరి చిన్నా, ఫాదర్ జయరాజు, సంఘస్తులు



సెమీక్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

జగ్గయ్యపేట అర్బన్: సెమీ క్రిస్మస్ వేడుకలను జగ్గయ్యపేట పట్టణంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మున్సిపల్ మాజీ చైర్మన్ ఇంటూరి రాజగోపాల్(చిన్నా) నివాసం వద్ద ఏర్పాటు చేసిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో స్థానిక ఆర్‌సీఎం చర్చి ఫాదర్ గుడిసె జయరాజు ముఖ్యఅతిథి పాల్గొని దైవసందేశం ఇచ్చారు. క్రీస్తు ఆచరించి చూపించిన మాదిరి జీవితాన్ని ఆచరించడమే నిజమైన క్రిస్మస్ అని పేర్కొన్నారు. క్రిస్మస్ కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. సెయింట్ ఆన్స్ సుపీరియర్ సిస్టర్ మేరీ ఆంటో, చర్చి కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పాశం శ్రీనివాసరెడ్డి, సురేష్, కమిటీ సభ్యులు, సంఘస్తులు పాల్గొన్నారు.

**పాఠశాలలో ..**

జగ్గయ్యపేట: పట్టణంలోని చైతన్య పాఠశాలలో సెమీక్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ లావణ్య ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి అందరికీ పంచిపెట్టారు. అంతేకాకుండా ఏసుప్రభు జనన వృత్తాంతాన్ని తెలియజేసే పశువుల పాక సెట్టింగ్ ప్రత్యేకాకర్షణగా నిలిచింది. పాస్టర్ మాడుగుల శ్రీకాంత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కవులు సమాజాన్ని అధ్యయనం చేయాలి



కవులను సత్కరిస్తున్న యుగంధరాచార్య, డాక్టర్ పాలపర్తి, డాక్టర్ పూర్ణచందు

విజయవాడకల్చరల్: కవులు సమాజాన్ని అధ్యయనం చేయాలని కృష్ణా జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ జీవీ పూర్ణచందు సూచించారు. వాగ్దేవీ కళాపీఠం, విజయవాడ కవన వేదిక ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో కవి సమ్మేళనం నిర్వహించారు. పూర్ణచందు మాట్లాడుతూ కవులు సమాజ పురోభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. ద్విశతావధాని డాక్టర్ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ ఆధునిక కవిత్వంలో వస్తున్న మార్పులు అంశంగా ప్రసంగించారు. వాగ్దేవీ కళాపీఠం వ్యవస్థాపకుడు డాక్టర్ గానుగుల యుగంధరా చార్య మాట్లాడుతూ సంస్థ ద్వారా వర్ధమాన కవులకు వేదిక కల్పిస్తునట్లు వివరించారు. తెలుగు అధ్యాపకుడు డాక్టర్ జిల్లేపల్లి వేంకటచలపతిరావు వివిధ కవితా ప్రక్రియలు అంశంగా ప్రసంగించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కవులు స్వీయ కవితా గానం చేశారు. కవులను నిర్వాహకులు సత్కరించారు.

## రద్దీగా మారిన నందిగామ

నందిగామ: నియోజకవర్గవ్యాప్తంగా ఎక్కడ చూసినా క్రిస్మస్ సందడి కనిపిస్తోంది. నియోజకవర్గ ప్రధాన వ్యాపార కూడలి నందిగామ పట్టణం ఆదివారం నాడు కూడా ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు కొనుగోలుదారులతో రద్దీగా కనిపించింది. ముఖ్యంగా వస్త్ర, ఫ్యాన్సీ, కిరాణా, మిఠాయిల దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. క్రిస్మస్ పండగ నేపథ్యంలో వచ్చి వెళ్లే ప్రయాణికులతో నందిగామ బస్టాండ్ సైతం రద్దీగా కనిపించింది.

**కంచికచర్లలో..**

కంచికచర్ల : క్రిస్మస్ పర్వదినం సందర్భంగా ఆదివారం కంచికచర్లలోని రెడీమేడ్ దుకాణాలు, ఫ్యాన్సీ, కిరాణా షాపులు, పూలకొట్లు, బేకరీలు జనంతో కిటకిటలాడాయి. పట్టణంతోపాటు పరిసర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన కొనుగోలుదారులతో కంచికచర్ల రద్దీగా మారింది.



## కొనసాగుతున్న ఏకాదశి మహోత్సవాలు



నందిగామ: పట్టణంలోని ముక్కోటి మహామండపంలో 124వ వైకుంఠ ఏకాదశి మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారికి విశేష పూజలు చేశారు. రుగ్వేద పారాయణం, నారాయణసేవ, బ్రాహ్మణ సమారాధన కార్యక్రమాలు నిర్వహించారు. ఆధ్యాత్మిక ప్రవచనాలు, హరికథా కాలక్షేపం కార్యక్రమాలు రాత్రి పొద్దుపోయే వరకు కొనసాగాయి. ఆయా కార్యక్రమాల్లో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ఇంజినీరింగ్ విద్యార్థి అదృశ్యం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): తండ్రి మందలించాడని ఇంజినీరింగ్ విద్యార్థి ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటన భవానీపురం పోలీసు స్టేషన్ పరిధిలోని గొల్లపూడి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు .. గొల్లపూడి సాయిపురం కాలనీకి చెందిన అల్లం పాపారావు మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి కళాశాలలో ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. మొదటి సంవత్సరానికి సంబంధించి కొన్ని సబ్జెక్టులు మిగిలిపోయాయి. ఎందుకు మిగిలిపోయాయని తండ్రి మందలించాడు. దీంతో అవమానంగా భావించిన పాపారావు ఆదివారం ఉదయం 10 గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లిపోయాడు. తాను వెళ్లిపోతున్నానని, తన కోసం వెతకవద్దని లేఖ రాసి పెట్టి వెళ్లాడు. స్నేహితులు, చుట్టుపక్కల వారిని విచారించిన ఆచూకీ తెలియలేదు. దీంతో పాపారావు తండ్రి ఆంజనేయులు ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

## వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



రామకృష్ణాపురం శ్రీదుర్గాదేవి దేవాలయంలో స్వామివారు

మధురానగర్(విజయవాడ సెంట్రల్): ధనుర్మాసోత్సవాల్లో భాగంగా రామకృష్ణాపురం శ్రీదుర్గాదేవి దేవాలయంలో వెంకటేశ్వరస్వామి వారికి ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. లక్ష్మీనారాయణులకు ప్రీతికరమైన ధనుర్మాసం కావటంతో పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. విష్ణు సహస్రనామపారాయణం చేశారు. ఆలయ ధర్మకర్త రాజు పర్యవేక్షించారు

## నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు షిరిడీ సాయిబాబా మందిరంలో ఆధ్యాత్మికత, సేవలను రెండు కళ్లుగా చేసుకుని పనిచేస్తున్నామని మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి అన్నారు. మందిరంలో ఆదివారం ఆలయకమిటీ ఆధ్వర్యంలో నిరుపేదలకు ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ దాతలు, భక్తుల సహకారంతో షిరిడీలో మాదిరిగా అన్ని ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఏటా చలికాలంలో దుప్పట్లు పంపిణీ, నగర పాలక సంస్థ పాఠశాల పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ఫీజు చెల్లింపు, నిత్యాన్నదానం, ఉచిత హోమియో, అల్లోపతి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. మందిర కార్యదర్శి కుంచనపల్లి రవిశంకర్, కోశాధికారి మందలపర్తి సత్యశ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

## పేట ప్రభుత్వాసుపత్రి అభివృద్ధికి కృషి



ఫౌంటెయిన్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్నవిప్ ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: గతంలో ఎన్నడూలేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో వైద్యరంగానికి అధిక ప్రాధాన్యతనిస్తూ వైద్య రంగంలో విప్లవాత్మక సంస్కరణలు చేపట్టారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను పేర్కొన్నారు. పేట ప్రభుత్వాస్పత్రి సుందరీకరణలో భాగంగా ప్రభుత్వాస్పత్రి ప్రధాన ద్వారం వద్ద రూ.12 లక్షల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేస్తున్న వాటర్ ఫౌంటెయిన్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే ఉదయభాను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు చెప్పారు. అందులోభాగంగా ఆస్పత్రి అభివృద్ధితోపాటు సుందరీకరణకు ప్రాధాన్యమిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఆస్పత్రిని రూ.3కోట్లతో ఆధునీకరించామన్నారు. 30 పడకలను 50 కు పెంచామని, గతంలో నలుగురు వైద్యులు మాత్రమే ఉండగా, ప్రస్తుతం 12మంది వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉన్నారని గుర్తుచేశారు. ఇన్, ఔట్ గేట్ల నిర్మాణం, ఆస్పత్రి ఆవరణలో సీసీ రోడ్లు, క్యాంటిన్ నిర్మాణం పనులు పూర్తయ్యాయన్నారు. ఫౌంటెయిన్ పనులను త్వరితగతిన పూర్తిచేస్తామని వివరించారు. ఎమ్మెల్యే వెంట కేడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, పెనుగంచిప్రోలు దేవస్థానం చైర్మన్ జంగాల వాసు, ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కఠారి హరిబాబు, వైఎస్సార్ సీపీ పేట మండల అధ్యక్షుడు శ్రీనివాసగౌడ్, తిరుమలరావు ఉన్నారు.